ఇలా ఉంటే ఎలా వెళ్లాలి !

- బస్టాండ్ ముఖద్వారం వద్ద సగానికి పైగా ఆక్రమణ
- బస్టాండ్ లోపలికి వెళ్లాలంటే అవస్థలే
- నిద్రపోతున్న ఆర్టీసీ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


నో పార్కింగ్ బోర్డులు పెట్టినా బస్సులు వెళ్లలేని దుస్థితి


బస్టాండ్ లోపలికి వెళ్లే మార్గంలో నిలిపిన ద్విచక్రవాహనాలు

చీరాల అర్బన్:

పేద, మధ్య తరగతి కుటుంబాలు చాలామంది ప్రభుత్వ రవాణ సంస్థపై ఆధారపడతారు. ఎందుకంటే అందుబాటులో టికెట్ ధరలు, భద్రతా కారణాల వల్ల ఆర్టీసీ వైపు మొగ్గుచూపుతారు. అందుకు ఆదాయం బాగా వస్తున్నా అధికారులు బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలన్నా కోరిక ఏకోశానాలేదు. అంతే కాదు వీటన్నింటినీ పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ ప్రయాణికులను ఇబ్బందులపాలు చేస్తున్నారు. చీరాల ఆర్టీసీ బస్టాండ్ లోనికి వెళ్లాలంటే ప్రయాణికులు ఎన్నో ప్రయాసలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారం ముందు ద్విచక్రవాహనాలు, ఆక్రమణలకు గురికావడంతో బస్టాండ్‌లోనికి వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు లోపలికి, బయటకు వెళ్లే మార్గాలలో వెళ్లే పరిస్థితి దారుణంగా ఉంది. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలో చీరాల, పర్చూరు నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం 88 బస్సులు చీరాల, పర్చూరు నియోజకవర్గాలతో పాటు ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాలకు బస్సుల్లో ప్రయాణికులను చేరవేస్తుంటాయి. నిత్యం వివిధ ప్రాంతాలకు సుమారు 8 వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్ లోపలికి రావాలంటే ప్రధాన మార్గం గుండా లోపలికి వెళ్లాలి. అయితే ఆ దారిలో అన్ని అడ్డంకులు ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రవేశద్వారం పక్కన గతంలో సైకిల్ స్టాండ్ ఉండేది. అలానే బస్టాండ్ ప్రాంగణంలో వెంకటేశ్వరస్వామి మందిరం ఉంది. ఆ మందిరానికి వచ్చే భక్తుల కోసం బస్టాండ్ లోపలికి వచ్చే మార్గంలో సగానికి పైగా తాళ్లతో కట్టి మూసివేశారు. అలానే అదే ప్రాంతంలో టీస్టాల్ కూడా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో టీ తాగేందుకు వచ్చే వారితో పాటు ద్విచక్రవాహనాలు అక్కడే పార్కింగ్ చేయడం వలన ప్రవేశద్వారం పూర్తిగా మూసుకుపోయింది.

ఉత్సవాల సమయంలో ప్రయాణికులకు నరకం..

నో పార్కింగ్ బోర్డులు పెట్టినా అక్కడే ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంకటేశ్వర స్వామి మందిరంలోకి వెళ్లాలంటే ఆ మార్గం గుండానే వెళ్లాలి. ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాల సమయంలో రోడ్డు రద్దీగా ఉంటుంది. లోపలికి వెళ్లేందుకు దారి లేక భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారం గుండా వెళ్లేందుకు దారి లేకపోవడంతో ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే బస్సులు లోపలికి, బయటకు వచ్చే దారిలోనే లోపలికి వెళ్లేందుకు ప్రయాసలు పడుతున్నారు. బస్సు ఎక్కేందుకు రోడ్డుకు ఎదురెళ్లి లోపలికి వెళ్తున్నారు. ప్రైవేటు వాహనాలు లోపలికి రాకుండా ఆర్టీసీ సిబ్బంది గట్టి ఏర్పాటు చేయడంతో ప్రధాన రోడ్డు నుంచి లోపలికి నడిచి వస్తున్నారు. బస్టాండ్ పక్కన డిపో మేనేజర్ కార్యాలయం ఉండడంతో సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు.


రోడ్డుపైనే బస్సులు ఆపిన డ్రైవర్లు..

ప్లాట్‌ఫాంలు విడిచి రోడ్డుపైనే బస్సులు..

చీరాల నుంచి చిలకలూరిపేట, నరసరావుపేట వెళ్లే బస్సులు కోసం ప్లాట్‌ఫాంలు ఉన్నా ఆ బస్సులు మాత్రం రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. చీరాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని ఒకవైపు చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, ఇంకొల్లు, మార్టూరు, కుంకులమర్రు, స్వర్ణ వైపు వెళ్లే బస్సుల కోసం ప్లాట్‌ఫాంలు కేటాయించారు. అయితే వీటిలో కేవలం కుంకలమర్రు, స్వర్ణ, మార్టూరు వైపు వెళ్లే బస్సులు మాత్రమే నిలుపుదల చేస్తున్నారు. చిలకలూరిపేట, నరసరావుపేట వెళ్లే బస్సులు మాత్రం ప్లాట్‌ఫాంలపై నిలపకుండా రోడ్డు పక్కన నిలుపుతున్నారు. ప్లాట్‌ఫాంలపై కుర్చీలు, ఫ్యాన్లు ఉన్నా అక్కడెవరూ ఉండకపోవడం విశేషం. ఒక్కోసారి ఎండైనా, వానైనా అక్కడకు వచ్చి ప్రయాణికులు బస్సులు ఎక్కుతున్నారు. అదేమంటే ప్రైవేటు వాహనాలకు అడ్డుకట్ట వేసేందుకు రోడ్డుపైనే బస్సులు నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు.

> **ద్విచక్రవాహనాలతో ఇబ్బందిగా ఉంది..**
> ద్విచక్రవాహనాలు ఇష్టారాజ్యంగా పెడుతున్నందుకే నో పార్కింగ్ పెట్టాం. ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారం ముందు ఇష్టారాజ్యంగా ద్విచక్రవాహనాలను నిలిపివేస్తున్నారు. టీ స్టాల్స్‌కు వచ్చేవారు కూడా అక్కడే పార్కింగ్ చేయడం వలన ఇబ్బందులు కలుగుతున్నాయి. అందుకు నో పార్కింగ్ బోర్డులు పెట్టాం. టీ స్టాల్స్ నిర్వాహకులకు వాహనాలు నిలుపుదల చేయకుండా చూడాలని సూచనలు చేశాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
> – కే శ్యామలాకుమారి, డిపో మేనేజర్

క్లుప్తంగా

రేపు విద్యార్థులకు అభినందన సభ

జే.పంగులూరు: పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించనున్నామని పంగులూరు హైస్కూల్ హెచ్‌ఎం కె రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2024 పది పరీక్షలలో మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంచి మార్కులు, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను ఈనెల 20వ తేది శనివారం అభినందించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎంఈవోలు నాగభూషణం, జి వీరాంజనేయులు పాల్గొంటారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

చీరాల రూరల్: రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని గురువారం జూనియర్ కళాశాలల ప్రతినిధులు రాష్ట్ర అధ్యక్షులు గారపాటి పుష్పరాజు, ఇతర ప్రతినిధులు కారంచేడులోని ఆమె స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాలుతో ఆమెను సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో పెండింగ్‌లో ఉన్న కళాశాలల సమస్యలను పరిష్కరించాలని ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఎంపీని కలసిన వారిలో జిల్లా అధ్యక్షుడు మన్నం రవికుమార్, బల్లికురవ వెంకటేశ్వర్లు ఉన్నారు

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

అద్దంకి రూరల్: ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా నిలిపి వేయటంతో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టిన ఘటన గురువారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళ్తున్నలారీ ముందుగా వెళ్తూ అద్దంకి పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ఆగిపోయింది. ఈ క్రమంలో ఒంగోలు నుంచి అద్దంకి వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. బస్సు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. కాగా అందులోని ప్రయాణికులు ఏమి కాలేదు. పెనుప్రమాదం త్రుటిలో తప్పడంతో ప్రయాణీలు ఊపిరిపీల్చుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై గట్టి నిఘా

అద్దంకి రూరల్: ఆపరేషన్ ఎలక్ట్రికల్ ఒంగోలు ఆదేశాల మేరకు అద్దంకి డివిజన్ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ సీఐ బీటీ నాయక్ అన్నారు. గురువారం ఇటీవల జరుగుతున్న దొంగతనాలపై అద్దంకి సర్కిల్ సీఐ కృష్ణయ్య, విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం అద్దంకిలోని విజిలెన్స్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ మాట్లాడుతూ దొంగతనాలకు సంబంధించిన నేరస్తులను పట్టుకోవడానికి, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. దొంగతనాలు అరికట్టేందుకు రెండు బృందాలుగా ఏర్పాటుచేసి గాలింపు చర్యలు ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో అద్దంకి ఎలక్ట్రికల్ ఏడీఈ టి. సత్యనారాయణ, ఏఈ ఏఆర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వేటపాలెం: బీబీహెచ్ 1992–93 పూర్వ విద్యార్థులు గురువారం 8,9 తరగతి చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు బాపట్ల ఎలక్ట్రికల్ డీఈ బట్ట హరిప్రసాద్, బూసం శివశంకరరావు, పి.శేషుబాబు, అక్కల వెంకటేశ్వర్లుల ఆర్థిక సాయంతో 8,9 తరగతులు ఇంగ్లిషు మీడియం చదువుతున్న 80 మంది విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ్ల బాపయ్య విద్యా సంస్థల ప్రెసిడెంట్ బండ్ల అంకయ్యశెట్టి, కరస్పాండెంట్ లేళ్ల కృష్ణమూర్తి, రిటైర్డు హెచ్‌ఎం పింజల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో డయేరియా నివారణ

కారంచేడు: ప్రజలను పట్టి పీడిస్తున్న అతిసార (డయేరియా) వ్యాధి నుంచి సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కారంచేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులతో డయేరియాపై అవగాహన ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేసి మాట్లాడారు. అతిసార వ్యాధిపై వాల్‌పోస్టర్, పాంప్లెట్స్, బ్యానర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు పాటిస్తే డయేరియాను నివారించవచ్చన్నారు. భోజనానికి ముందు, మరుగుదొడ్లు వినియోగించిన తరువాత తప్పకుండా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. తల్లిపాలు తాగకపోవడం, ప్రతిదీ వాంతి చేసుకోవడం, పలుచని మల విసర్జన తరువాత నిర్జలీకరణ, అనారోగ్యానికి గురవ్వడం, మలంలో రక్తం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ శ్రీనివాసరావు, హెచ్‌వీ వీరమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో మన కుటుంబానికి సంతోషం


అద్దంకిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


పర్చూరు బొమ్మలసెంటర్ వద్ద హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తున్న జడ్జి ప్రశాంతి


చీరాలలో ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు, పోలీసులు

- మానవహారాలు, ర్యాలీలతో అవగాహన

అద్దంకి: హెల్మెట్ వాడకం వలన మనతోపాటు మన కుటుంబం సంతోషంగా ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి అన్నారు. హెల్మెట్ ధరించడంపై అవగాహన కోసం ఒక కిలోమీటర్ పట్టణంలో ఉదయం కిలోమీటరు వాక్ నిర్వహించారు. ఈక్రమంలో హెల్మెట్ ధరించని ఓ విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తరువాత అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పోలీసు సిబ్బందితో మానవహారం ఏర్పాటు చేశారు. అందరికీ అవగాహన కోసం హెల్మెట్ ధరించి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ కోర్టు ఆదేశించిందనే కాకుండా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి బైకును నడిపితే సురక్షితంగా ప్రయాణం చేయవచ్చని చెప్పారు. హెల్మెట్ ధరిస్తే కలిగే ప్రయోజనాలను అందరికీ తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో చాలామంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, సురక్షితంగా ఇంటికి చేరాలంటే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జె.సీత, అడిషనల్ జూనియర్ జడ్జి ప్రియదర్శిని నూతక్కి పాల్గొన్నారు. న్యాయవాదులు న్యాయవాద గుమస్తాలు పారా లీగల్ వలంటీర్లు, ప్రకాశం ప్రభుత్వ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం..

పర్చూరు (కారంచేడు): ద్విచక్రవాహనదారులు ప్రయాణ సమయంలో తప్పకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు హెల్మెట్‌లను ధరించాలని, హెల్మెట్‌లు లేని ప్రయాణం ప్రాణాలకు ప్రమాదమని పర్చూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రమైన పర్చూరు కోర్టు నుంచి బొమ్మలసెంటర్ వరకు స్థానిక న్యాయవాదులు, సిబ్బందితో కలసి ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఒగ్గిశెట్టి గోవిందరాజులు, యార్లగడ్డ రాఘవయ్యచౌదరి, కొమ్మాలపాటి రవి, రావి శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై జీవీ చౌదరి, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల రూరల్ : హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడిపి ప్రాణాలు కాపాడుకోవాలని.. తమ కుటుంబాలు రోడ్డున పడకుండా చూసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా 1 కె ర్యాలీ నిర్వహించారు. ముందుగా కోర్టు వద్ద నుంచి న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానాలు కోర్టు వద్ద నుంచి పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. శ్రీనివాసరావు, చీరాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి. రామకృష్ణారెడ్డి, టూ టౌన్ సీఐ సోమశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రమేష్ బాబు, బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జికె. ఈశ్వరి రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలు కుష్టువ్యాధి కావచ్చు


స్వర్ణలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

స్వర్ణ (కారంచేడు): శరీరంపై స్పర్శలేని మచ్చలు కుష్టువ్యాధి లక్షణాల్లో ఒకటని డీపీఎంఓ ప్రదీప్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. ఈ వ్యాధి 'మైకోబాక్టీరియం లెప్రే' అను బాక్టీరియా వలన వస్తుందన్నారు. తుమ్మడం, దగ్గడం వలన ఈ క్రిములు వ్యాప్తి చెందుతాయన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించడానికి మూడు నుంచి ఐదు సంవత్సరాలు పడుతుందన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. వైద్య సిబ్బంది, ఆశలు గ్రామాల్లో ఇంటింటికి వచ్చి శరీరంపై ఉండే మచ్చలను గుర్తిస్తారన్నారు. ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. ప్రధానంగా చెవులపైన, వీపుపైన, ఎదపైన నొప్పి లేని బుడిపెలు, కనుబొమ్మలు పూర్తిగా మూసుకోకపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండటం, అరచేతులు, అరికాళ్లు స్పర్శలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలున్న వారు సమీప ఆసుపత్రికి వెళ్తే అక్కడ పరీక్షలు చేసి ఉచితంగా ఎండీటీ మాత్రలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ షాలినీ, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసీఫోరా, ఎంపీహెచ్ఈఓ నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ: కుష్టువ్యాధి సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు షేక్ రమీజ్ అహమ్మద్, జీ. రవితేజ, భారతి, మమత కోరారు. గురువారం ప్రారంభమైన సర్వేకు సంబంధించి పలు గ్రామాల్లో తనిఖీలతో సర్వే టీమ్‌కు సూచనలు సలహాలు ఇచ్చారు. సర్వే టీమ్‌కు వాస్తవాలు తెలియజేయాలని ఆగస్టు రెండో తేదీ వరకు గ్రామాల వారీగా సర్వే కొనసాగించాలని వైద్యాధికారులు ఆదేశించారు.

వృద్ధుడి కాలుపైకెక్కిన వాహనం


ప్రమాదంలో గాయాలపాలై రక్తమోడుతూ కేకలు వేస్తున్న యాచకుడు సుబ్బారావు

చీరాల రూరల్: వృద్ధుడిని గమనించక నిర్లక్ష్యంగా వాహనం నడిపడంతో యాచకుడికి తీవ్రగాయాలయ్యాయి. చీరాల రైల్వే స్టేషన్ ఆవరణలో కూర్చుని భోజనం చేస్తున్న ఓ యాచక వృద్ధుడి కాలుపై బొలెరో వాహనం ఎక్కడంతో అతని కుడికాలు నుజ్జునుజ్జయింది. ఈఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. వినుకొండ సమీపంలోని యేల్చూరు గ్రామానికి చెందిన కంచర్ల సుబ్బారావు అనే వృద్ధుడు గత రెండేళ్లుగా చీరాల రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతడు సాయంత్రం సమయంలో రైల్వే స్టేషన్ ఆవరణలోని ఫుడ్‌కోర్టు వెనుక కూర్చుని భోజనం చేస్తున్నాడు. ఇంతలో అక్కడే పార్క్ చేసి ఉన్న బొలెరో వాహనం అకస్మాత్తుగా అతని కుడికాలు పైకి ఎక్కింది. ఈ ఘటనలో అతని మోకాలు వరకు కండ పూర్తిగా ఊడిపోయి ఎముక బయటకు వచ్చింది. రక్తపు మడుగులో పడిన ఆ వృద్ధుడు పెద్దపెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న ప్రయాణికులు, ఇతర పాదాచారులు వాహనాన్ని నిలిపేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఒన్ టౌన్ ఏఎస్సై వెంకటేశ్వర్లు ఇతర కానిస్టేబుళ్లు వచ్చి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యాచకుడికి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వృద్ధుడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్యం


నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వేటపాలెం: ప్రతి ఒక్కరూ ఔషధ మొక్కలు వారి ఇంటి ముందు పెంచుకుని ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ ఎంవీఎస్ శర్మ అన్నారు. గురువారం మండలంలోని అక్కాయపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో ప్రాటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు విజయవాడ సౌజన్యంతో నిర్వహిస్తున్న నర్సరీని ఎంపీడీఓ పరిశీలించారు. వర్షాకాలంలో మాచిపత్రి, తులసి, రణపాల, శంకుపూల మొక్కలు, మారేడు, వావిలి, సరస్వతి, వమ్ము, అవిశ, కాడ జముదు, ఉత్తరేణి తదితర మొక్కలు ఆసక్తి గల రైతులకు, డ్వాక్రా మహిళలకు అందిస్తామన్నారు. అలానే గుడి ప్రాంగణంలో పెంచుకునే దైవవృక్షాలను దేవాలయాలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎస్.చంద్రారెడ్డి, దేశాయిపేట పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిస్వార్థసేవ చేస్తే గుర్తింపు


సుబ్బారావును సత్కరిస్తున్న వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది

చినగంజాం: ప్రజలకు నిస్వార్థసేవ చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని వైద్యులు పేర్కొన్నారు. గురువారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మేల్ నర్సింగ్ డ్రస్సర్‌గా పని చేసి రోగులచే ప్రశంసలు అందుకున్న పమిడాల సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు మాట్లాడుతూ పమిడాల సుబ్బారావు మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్ఓ) గా 2011లో బదిలీపై చినగంజాం పీహెచ్‌సీకి వచ్చారు. సుమారు పదేళ్లుగా ఇక్కడ పనిచేసి వైద్యులు, రోగులకు సేవలందించారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఎక్కడ తగ్గని గాయాలు, షుగర్ గాయాలు, ఆక్సిడెంట్ కేసులు, సుబ్బారావుచే డ్రస్సింగ్ చేయించుకొని అందరి మన్నలు పొందారు. ఉద్యోగంలో బదిలీలో భాగంగా సుబ్బారావు 2019లో ప్రకాశం జిల్లా కరవది పీహెచ్‌సీకి వెళ్లారు. కాని చినగంజాం పీహెచ్‌సీ పరిధిలోని రోగులు, ప్రజలు అయన చేసే మేలును మర్చిపోలేక కలెక్టర్‌కు, ఎమ్మెల్యే, డీఎంహెచ్‌వోలకు లేఖలు రాసి మళ్లీ సుబ్బారావును చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేయించుకున్నారు. ఇలాంటి సందర్భాలు, వ్యక్తులు అరుదుగా ఉంటారని వైద్యులు డాక్టర్ ఎస్ విజయ భాస్కర్, డాక్టర్ పి సాయిశ్రీ చరణ్ కొనియాడారు. అనంతరం సుబ్బారావును పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్ఎన్ఓ సుబ్బారావు, పర్వతరెడ్డి నాగేశ్వరావు, పాలకం నాగమల్లేశ్వరావు, షేక్ జిలానీ, పఠాన్, రోగులు, ప్రజలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంత రక్షణకు చర్యలు చేపట్టాలి

చినగంజాం (పర్చూరు): తరచూ నల్లమడ వరదల వలన ముంపుకు గురవుతున్న ప్రాంతానికి శాశ్వత వరద నివారణ చర్యలు చేపట్టాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదలకు గురవుతున్న ప్రాంతాన్ని రక్షిస్తామని ప్రభుత్వం గతంలో అనేక వాగ్దానాలు చేసిందని ఆయన గుర్తు చేశారు. గురువారం పెరుకూరులో వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య అధ్యక్షతన నాయకులు బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ 2016లో సీఎం చంద్రబాబు కాకుమాను సభలో నల్లమడ వరద నివారణకు నిధులు కేటాయిస్తామన్నారని తెలిపారు. సాకి వాగు, చింతల వాగు, యితర వాగులన్నీ పూర్తిగా పూడికతో నిండిపోయాయని తెలిపారు. అందువల్ల వర్షపు నీరు వరదలాగా వచ్చి పొలాల మీదుగా పారుతూ పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే పూడికను తీసివేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయకుమార్, అంకమ్మచౌదరి, మానం వినీత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊపిరి దళిత మహాసభ


దళిత మహాసభ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అబ్రహాం బ్లెస్సీ

చీరాల రూరల్: ఉద్యమాలకు ఊపిరి అందించి ప్రజల తరపున అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించింది ఒక్క దళిత మహాసభ మాత్రమేనని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ అన్నారు. గురువారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని ఓల్డ్ పీకాక్ బిల్డింగ్‌లోని పైఅంతస్తులో దళిత మహాసభ నూతన కార్యాలయాన్ని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అబ్రహాం బ్లెస్సీ చేతులు మీదుగా ప్రారంభించి మాట్లాడారు. దళితుల తరపున అనేక ఉద్యమాలు చేసిన ఘనత దళిత మహాసభకు దక్కుతుందని తెలిపారు. నేటి తరం యువత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తూ తమ కులాలు చెప్పుకోవటానికి కూడా సిగ్గుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముందుగా నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పులిపాటి బాబురావు, దామర్ల శ్రీకృష్ణ, చుండూరు వాసు, మేరిగ రమేష్, పేర్లి రత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడిపై కేసు నమోదు

అద్దంకి రూరల్: ఆస్తి తగాదాలతో మహిళపై దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఉమెన్ ఎస్సై డీ. రత్నకుమారి వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన చెన్నుపాటి నాగలక్ష్మికి అదే గ్రామానికి చెందిన చెన్నుపాటి సాంబశివరావుతో కొంత కాలంగా ఆస్తి వివాదాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 15వ తేదీన గ్రామంలోని మిల్క్‌డైరీ వద్దకు వచ్చిన నాగలక్ష్మిని చెన్నుపాటి సాంబశివరావు, వెంకటేశ్వర్లు, అంజనేయులు అనే వారు ఆమెని తిట్టి కర్రతో దాడికి పాల్పడ్డారు. అక్కడికి వచ్చిన ఆమె కుమారుడిపై కూడా దాడి చేయటంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఇరువురిని స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్టేషన్‌నుంచి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సెయింట్ ఆన్స్ కాలేజీలో వంద శాతం సీట్ల భర్తీ


కళాశాలలో కేక్ కట్ చేస్తున్న యాజమాన్యం

చీరాల: ఇంజినీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024లో కన్వీనర్ కోటాలో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2001లో మూడు కోర్సులతో 180 సీట్లతో కళాశాలను స్థాపించారన్నారు. ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ నుంచి శాశ్వత గుర్తింపు పొందిందన్నారు. ఏపీ ప్రభుత్వం నుంచి ఏ గ్రేడ్ గుర్తింపును సాధించామన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన

అద్దంకి రూరల్: సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టాలపై మండల స్థాయిలో అవగాహన కార్యక్రమం శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండ పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.